సాక్షి
నాగర్‌కర్నూల్

శనివారం । 3 । మే । 2025



పిడుగు.. పసిగట్టు

పిడుగుపాటును ముందే పసిగట్టేందుకు వీలుగా దామిని యాప్‌ను రూపొందించారు.

వివరాలు 10లో ▸



ఆరుద్ర పూజలు

అలంపూర్ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో ఆరుద్రోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
41.5 /22.5

వాతావరణం

ఉదయం నుంచే ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత పెరుగుతుంది. వేడిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

అగ్నివీర్‌లో చేరికకు దరఖాస్తుల స్వీకరణ

కందనూలు: భారత వైమానిక దళంలో అగ్నివీర్‌గా చేరడానికి పదో తరగతి ఉత్తీర్ణులైన 1.1.2005 నుంచి 1.7.2008 మధ్య జన్మించిన నిరుద్యోగ యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి రాఘవేందర్‌సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు https://agnipathvayu.cdac.in వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 11 వరకు దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు సెల్ నంబర్లు 95119 47457, 040- 27758212 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పరిశ్రమల కేంద్రంలో..

జిల్లా పరిశ్రమల కేంద్రంలో సంస్థాభివృద్ధి కేంద్రం ఏర్పాటు చేసి అందులో మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ పోస్టులను సృష్టించారని, దీనికి గాను జిల్లాకు కేటాయించిన రెండు పోస్టులు కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేస్తామని జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగలవారు ఈ నెల 10లోగా దరఖాస్తు చేసుకోవాలని, విద్యార్హతలకు సంబంధించి https://www.nimsme.gov.in/careers వెబ్‌సైట్‌లో చూసుకోవాలని చెప్పారు.

పుస్తక విక్రయ దుకాణాల పేర్లు అందజేయండి

కందనూలు: జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను విక్రయించే దుకాణదారుల పేర్లను తమ కార్యాలయంలో అందజేయాలని డీఈఓ రమేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలాల వారిగా 2025- 26 విద్యా సంవత్సరానికి గాను 1 నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠ్య పుస్తకాలను విక్రయించే దుకాణదారుల పేర్లను ఈ నెల 5లోగా తప్పకుండా సమర్పించాలని ఆదేశించారు. ఆ తర్వాత ఇచ్చిన వారి పేర్లను పరిగణలోకి తీసుకోమని చెప్పారు.

ఇంటర్ కళాశాలగా అప్‌గ్రేడ్

ఉప్పునుంతల: మండల కేంద్రంలోని కేజీబీవీని ఈ విద్యా సంవత్సరం నుంచి జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని ప్రిన్సిపాల్ సైదా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేజీబీవీలో ఈ ఏడాది సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ గ్రూప్‌లు ఉంటాయని, ఇంగ్లిష్, తెలుగు మీడియంలో బోధించడం జరుగుతుందన్నారు. పదో తరగతి కేజీబీవీలో చదివిన విద్యార్థినులు, తల్లిదండ్రులు లేని పేద విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు మండలానికి చెందిన విద్యార్థినులకు మాత్రమే ఎలాంటి ప్రవేశ పరీక్ష నిర్వహించకుండా అడ్మిషన్లు ఇస్తామని ఆమె వివరించారు.

ఆలయ భూముల వేలం మరోసారి వాయిదా

అలంపూర్: అలంపూర్ క్షేత్ర ఆలయాల భూముల కౌలు వేలం పాట మరోసారి వాయిదా పడినట్లు ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ తెలిపారు. శుక్రవారం జోగులాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయ సముదాయంలో ఆలయ భూముల కౌలు వేలం నిర్వహించారు. గత నెల 21వ తేదీన ఆలయాలకు సంబంధించిన అన్ని భూములకు బహిరంగ కౌలు వేలం నిర్వహించారు. వాటిలో 6 సర్వే నెంబర్లకు చెందిన భూముల కౌలు వేలం ధర రాకపోవడంతో అధికారులు వాయిదా వేశారు. రెండో సారి మిగిలిన భూముల బహిరంగ కౌలు వేలం నిర్వహించారు. కర్నూల్ జిల్లా కల్లూరు శివారులోని 346/1, 346/3 సర్వే నెంబర్లలోని 15.18 ఎకరాల భూమికి ఇద్దరు వ్యక్తులు డిపాజిట్ చెల్లించినట్లు ఈఓ పేర్కొన్నారు. కానీ వేలం షరతుల ప్రకారం కనీసం ముగ్గురు డిపాజిట్ చెల్లించాల్సి ఉండటంతో వేలం వాయిదా వేసినట్లు తెలిపారు. అదేవిధంగా మిగిలిన 5 సర్వే నెంబర్ల భూముల కౌలు వేలానికి రైతులు రాకపోవడంతో వాటిని వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ నెల 16న మరోసారి వేలం నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు.

బాదేపల్లి యార్డుకు పోటెత్తిన దిగుబడులు

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయమార్కెట్‌కు శుక్రవారం వ్యవసాయ పంట దిగుబడులు పోటెత్తాయి. దాదాపు 20 వేల బస్తాలకు పైగా పంట ఉత్పత్తులు విక్రయానికి వచ్చాయి. ఇందులో అత్యధికంగా 7 వేల క్వింటాళ్ల ధాన్యంతో పాటు 3,913 క్వింటాళ్ల మొక్కజొన్న యార్డుకు వచ్చింది.



'నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో కోల్డ్ స్టోరేజీ, మినీ స్టేడియం, ఆడిటోరియం నిర్మాణాల కోసం ఏర్పాటు చేసిన శిలాఫలకాలు ఇవి. వీటిని 2018లో ఏర్పాటు చేసినా ఇప్పటి వరకు ఆయా పనులు మొదలుపెట్టలేదు. కేంద్ర ప్రభుత్వం శ్యాంప్రసాద్ ముఖర్జీ రూర్బన్ పథకం కింద నిధులు మంజూరైనా ఐదేళ్లుగా పనులు చేపట్టలేదు. కేంద్రం విధించిన గడువు ముగియడంతో మంజూరైన నిధులను వినియోగించుకోలేని పరిస్థితి నెలకొంది.'



'మహబూబ్‌నగర్ జిల్లా గండేడ్ మండలకేంద్రంలో 2018లో రూర్బన్ పథకం కింద చేపట్టిన ఈ గోడౌన్ నిర్మాణం చేపట్టి ఐదేళ్లు గడిచినా పూర్తికాలేదు. ఇదే కాక పలు అభివృద్ధి పనుల కోసం అవసరమైన మేరకు నిధులు మంజూరైనా, పనులు పూర్తిచేయడంలో అధికారుల అలసత్వానికి ఇది నిదర్శనంగా నిలుస్తోంది.'

నిధులు వెనక్కి..

శ్యాంప్రసాద్ ముఖర్జీ రూర్బన్ మిషన్‌పై అధికారుల నిర్లక్ష్యం

- ఉమ్మడి జిల్లాలో పెద్దకొత్తపల్లి, గండేడ్ మండలాల ఎంపిక
- రెండింటికీ రూ.47.46 కోట్ల కేటాయింపు
- పనులు పూర్తిచేయడంలో తీవ్ర జాప్యం
- గడువు ముగియడంతో రూ.14 కోట్లు వాపస్

రూర్బన్ మిషన్ కింద చేపట్టిన పనుల వివరాలు

పెద్దకొత్తపల్లి మండలానికి మంజూరైన నిధులు రూ.30 కోట్లు	
ఇప్పటి వరకు ఖర్చు చేసినవి రూ.22 కోట్లు	మిగిలిన నిధులు రూ.8 కోట్లు
గండేడ్ మండలానికి మంజూరైన నిధులు రూ. 23.56 కోట్లు	
ఇప్పటి వరకు ఖర్చుచేసినవి రూ.17.46 కోట్లు	మిగిలిన నిధులు రూ.6.01 కోట్లు

సాక్షి, నాగర్‌కర్నూల్: ఎక్కడైనా నిధుల కొరతతో అభివృద్ధి పనులు నిలిచిపోవడం చూస్తుంటాం. కానీ, సమృద్ధిగా నిధులున్నా పనులు చేపట్టడంలో అధికారులు ప్రదర్శించిన అలసత్వం కారణంగా నిధులు నిరుపయోగంగా మారిన పరిస్థితి ఉమ్మడి పాలమూరులో చోటుచేసుకుంది. పట్టణాలు, గ్రామాల మధ్య తీవ్రమైన అంతరాలను తగ్గించేందుకు, గ్రామాలను సైతం పట్టణాలకు దీటుగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం శ్యాంప్రసాద్ ముఖర్జీ రూర్బన్ మిషన్ చేపట్టింది. గ్రామాల్లో పట్టణాల స్థాయి సౌకర్యాలు కల్పించేందుకు వీలుగా పెద్దఎత్తున నిధులు కేటాయిస్తోంది. ఈ క్రమంలో ఉమ్మడి పాలమూరులోని నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి, మహబూబ్‌నగర్ జిల్లా గండేడ్(పాత రంగారెడ్డి జిల్లా) మండలాలను ఈ పథకం కింద ఎంపిక చేసింది. 2018లోనే పెద్దకొత్తపల్లి మండలానికి రూ.30 కోట్లు, గండేడ్ మండలానికి రూ.23.56 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో చేపట్టిన ఆయా అభివృద్ధి పనులు ఐదేళ్లలో పూర్తిచేయాల్సి ఉండగా.. గడువు ముగుస్తున్నా అధికారులు తీవ్ర అలసత్వం ప్రదర్శించారు. నిధులు అందుబాటులో ఉన్నా కొన్ని పనులను పూర్తిచేయలేక, మరికొన్ని పనులను మొదలు పెట్టకపోవడంతో రూ.కోట్ల నిధులు వెనక్కి వెళ్లే పరిస్థితి దాపురించింది.

ఐదేళ్లుగా పనులు ప్రారంభించకుండా అలసత్వం..

పెద్దకొత్తపల్లి మండలంలో రూర్బన్ మిషన్ కింద అభివృద్ధి పనుల కోసం రూ.30 కోట్లు మంజూరయ్యాయి. వీటితో మండలంలోని గ్రామ పంచాయతీల భవనాలు, సీసీ రోడ్లు, తాగునీరు, వీధి దీపాలు, మురుగు కాల్వల ఏర్పాటు, విద్య, వైద్యం, పర్యాటక కేంద్రాల అభివృద్ధి చేపట్టాల్సి ఉండగా.. అధికారులు మాత్రం ఎక్కువగా భవనాల నిర్మాణాలు, సుందరీకరణ పనులకే కేటాయించారు. ఇప్పటి వరకు రూ.22 కోట్లు ఖర్చు చేసినట్టు చెబుతున్నా.. వీటిలో చాలా వరకు పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. అలాగే ఇంకా రూ.8 కోట్ల వరకు నిధులు అందుబాటులో ఉన్నా వీటికి సంబంధించిన పనులు మొదలు పెట్టలేదు. గడువులోగా పనులు పూర్తిచేయకపోవడంతో కేంద్రం ఈ నిధులు నిలిచిపోయాయి.

గండేడ్‌లో రూ.6 కోట్లు..

గండేడ్ మండల అభివృద్ధికి కేంద్రం రూ.23.56 కోట్లు మంజూరు చేసినా.. అధికారులు పూర్తిస్థాయిలో నిధులు వినియోగించుకోలేకపోయారు. ఇప్పటివరకు వివిధ పనుల కోసం రూ.17.46 కోట్లు ఖర్చు చేసినట్టు చెబుతుండగా.. వీటిలోనూ చాలా వరకు నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. ఇంకా సుమారు రూ.6 కోట్లకు సంబంధించిన పనులు మొదలుపెట్టలేదు. గండేడ్‌లో చేపట్టిన వ్యవసాయ గోడౌన్, కోల్డ్‌స్టోరేజీ, మినీ స్టేడియం, వెన్నచేడ్‌లోని పశువైద్య ఉపకేంద్రం భవన నిర్మాణం అసంపూర్తిగానే ఉన్నాయి. ఒకవైపు చాలావరకు అభివృద్ధి పనులను ప్రారంభించకపోవడం, మరోవైపు మొదలుపెట్టిన పనులను సైతం పూర్తి చేయకపోవడంతో రూర్బన్ మిషన్ లక్ష్యాన్ని నెరవేర్చలేకపోయారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



గండేడ్ మండలం వెన్నచేడ్‌లో అసంపూర్తిగా పశువైద్యశాల భవనం

శిలాఫలకాలకే పరిమితం..

పెద్దకొత్తపల్లి మండలంలో పలు అభివృద్ధి పనులు శిలాఫలకాలకే పరిమితమయ్యాయి. చెన్నపురావుపల్లి, చంద్రకల్‌లో డంపింగ్ యార్డు, పెద్దకొత్తపల్లిలో మినీ స్టేడియం, ఆడిటోరియం, గ్రంథాలయం, సాతాపూర్, కల్వకోలు గ్రామాల్లో బస్టాండ్ నిర్మాణం, చెన్నపురావుపల్లిలో అంగన్‌వాడీ భవనం, చంద్రబండాతండా, కొత్తయాపట్ల, నక్కలపల్లి గ్రామ పంచాయతీ భవనాలు, వెన్నచర్లలో వీధిదీపాల ఏర్పాటు, ముష్టిపల్లి, కల్వకోల్, చిన్నకొత్తపల్లి, గంట్రావుపల్లిలో ప్రభుత్వ పాఠశాలలకు తాగునీటి సౌకర్యం, పైప్‌లైన్, సంపు నిర్మాణం తదితర పనులను అధికారులు కనీసం మొదలు పెట్టలేకపోయారు. మిగతా పనులు సైతం వివిధ దశల్లో అసంపూర్తిగా ఉన్నాయి.

నిర్లక్ష్యం వహించారు..



కేంద్ర ప్రభుత్వం శ్యాంప్రసాద్ ముఖర్జీ రూర్బన్ పథకం కింద రూ.30 కోట్లు మంజూరు చేసింది. అభివృద్ధి పనుల కోసం మంజూరైన నిధులతో పనులు పూర్తిచేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహించారు. చాలావరకు పనులు పూర్తికాకుండానే కాంట్రాక్టర్లకు నిధులు కట్టబెట్టారు. మండలంలో కోల్డ్ స్టోరేజీలు, వృద్ధాశ్రమం, డంపింగ్ యార్డు తదితర నిర్మాణాలు ప్రారంభించలేదు.

– పరశురాముడు, బీజేపీ అధ్యక్షుడు, పెద్దకొత్తపల్లి మండలం

అనుకూలంగా లేక ఇబ్బంది పడుతున్నాం..



పశువైద్య కేంద్రం నిర్వహణకు అనువైన స్థలం ఏది లేకపోవడంతో పక్కనే ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ భవనంలోకి మార్చారు. అక్కడే ట్రేవిస్ అమర్చి పశువులకు చికిత్సలు నిర్వహిస్తున్నారు. ఇది రోడ్డుపై ఉండడం వల్ల చికిత్స అందించే సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎక్కువ మొత్తంలో వస్తే పశువులకు చికిత్సలు చేయడం కష్టం. ఐదారు గ్రామాలకు చెందిన రైతులు ఇక్కడికే వస్తారు. పక్కా భవన నిర్మాణం ఐదారేళ్లుగా లెంటల్ లెవల్‌లోనే ఆగిపోయింది. దాని గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు

– దండె కృష్ణయ్య, వెన్నాచేడ్

కాంట్రాక్టర్ల వల్లే..

పెద్దకొత్తపల్లి మండలంలో రూర్బన్ మిషన్ కింద మంజూరైన నిధులను చాలా వరకు వినియోగించుకున్నాం. గ్రామ పంచాయతీ భవనాలు, సీసీరోడ్లు, పార్కులను అభివృద్ధి చేశాం. కొన్ని పనులు కాంట్రాక్టర్ల జాప్యం వల్ల పూర్తికాలేదు. పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయించాం.

– చిన్న ఓబులేసు, డీఆర్‌డీఓ, నాగర్‌కర్నూల్

బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేస్తాం

కందనూలు: జిల్లాలో బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేస్తామని పార్టీ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రావు అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు సమావేశంలో జిల్లా సంస్థాగత ఎన్నికల సహ ఇన్‌చార్జ్ మొగిలి దుర్గాప్రసాద్‌తో కలిసి ఆయన మాట్లాడారు. జిల్లాలో పార్టీని పటిష్టపరచడానికి బూత్ స్థాయి నుంచి బలోపేతం చేస్తున్నామని, ఇందులో భాగంగానే నూతన మండల కమిటీలు ఏర్పాటు చేశామని, గతంలో చాలా మండలాల్లో కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని, తాజాగా పది మండలాలకు అధ్యక్షులను నియమించామని వివరించారు. నాగర్‌కర్నూల్ మున్సిపల్ అధ్యక్షుడిగా ప్రమోద్‌కుమార్, తెలకపల్లి మండల అధ్యక్షుడిగా చిన్నారెడ్డి, తిమ్మాజిపేట మండలాధ్యక్షుడిగా యశ్వంత్, నాగర్‌కర్నూల్ రూరల్ అధ్యక్షుడిగా లోమేశ్వర్‌రెడ్డి, అచ్చంపేట రూరల్ అధ్యక్షురాలిగా జ్యోతి, లింగాల మండల అధ్యక్షుడిగా నవీన్, చారకొండ అధ్యక్షుడిగా కృష్ణ, బల్మూరు మండల అధ్యక్షుడిగా బాలస్వామి, పదర మండల అధ్యక్షుడిగా రవి, అమ్రాబాద్ మండల అధ్యక్షుడిగా శ్రీనివాసులును నియమించినట్లు చెప్పారు. ఈ నెల 15లోగా గ్రామాల్లో బూత్ కమిటీలను ఏర్పాటు చేసిన ఉద్యమ కార్యాచరణ తీవ్రతరం చేస్తామన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రావు

భవిష్యత్‌లో బీసీలదే రాజ్యాధికారం

కల్వకుర్తి రూరల్: కేంద్ర ప్రభుత్వం జనగణనలో కులగణన చేపడుతామని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్దయ్య యాదవ్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కులగణన, చట్టసభల్లో బీసీ రిజర్వేషన్లు, కేంద్రంలో ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు కోసం బీసీ సంఘాలు 70 ఏళ్లుగా పోరాటం చేస్తున్నాయన్నారు. కేంద్రం నిర్ణయంతో భవిష్యత్‌లో రాజ్యాధికారం దిశగా బీసీలు ముందుకు సాగే అవకాశం ఉందన్నారు. ఇందులో సంఘం వ్యవస్థాపకుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పోరాటం ఎనలేనిదన్నారు. బీసీల హక్కుల కోసం సహకరించని పార్టీలకు భవిష్యత్‌లో మనుగడ ఉండదన్నారు. బీసీ ప్రధానమంత్రి హయాంలోనే బీసీ కులగణన, బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటుతోపాటు, చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని ప్రధాని నరేంద్రమోడీని ఆయన కోరారు. ప్రధానమంత్రి బీసీల పక్షపాతిగా చరిత్రలో నిలిచిపోతారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణనపై నిర్లక్ష్యం చేయకుండా ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేశాకే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

హమాలీలకు రూ.26 వేల వేతనం చెల్లించాలి

కల్వకుర్తి రూరల్: కార్మికులను బానిసత్వంలోకి నెట్టే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 20న నిర్వహించే సమ్మెను విజయవంతం చేద్దామని సివిల్ సప్లయ్ గోదాం హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బాలయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని సివిల్ సప్లయ్ గోదాం ఇన్‌చార్జ్ శశిధర్‌రావుకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థలో పనిచేస్తున్న హమాలీలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, అప్పటి వరకు హమాలీలకు రూ.26 వేల వేతనం చెల్లించాలన్నారు. ప్రమాదంలో చనిపోయిన హమాలీలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, 50 ఏళ్లు పైబడిన కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద రూ.5 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



సమ్మె నోటీస్ అందజేస్తున్న బాలయ్య తదితరులు

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి



ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్ తదితరులు

నాగర్‌కర్నూల్: జిల్లాలో అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. రాష్ట్ర సచివాలయం నుంచి శుక్రవారం చీఫ్ సెక్రటరీ రామకృష్ణరావుతో కలిసి భూ భారతి, ఇందిరమ్మ ఇళ్లు, నీట్ పరీక్ష ఏర్పాట్లపై కలెక్టర్లు, ఎస్పీలతో రాష్ట్ర రెవెన్యూ, గృహ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వీసీ నిర్వహించారు. వీసీ అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో భూ భారతి చట్టం అమలు చేయనున్న మండలంలోని గ్రామాల్లో రైతుల నుంచి భూ సమస్యల పరిష్కారానికి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. జిల్లాలో ఎంపిక చేసిన మండలంలోని ప్రతి గ్రామంలో హెల్ప్ డెస్క్, దరఖాస్తు సెంటర్లు ప్రారంభించాలని, అధికారులు గ్రామాలకు వెళ్లే ముందు ప్రజలందరికీ తెలిసేలా చాటింపు వేయించాలని, దరఖాస్తు ఫారాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితా త్వరితగతిన పూర్తిచేసి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఆమోదం తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితాలో నిరుపేదలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనర్హులను ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎట్టి పరిస్థితుల్లోనూ ఎంపిక చేయవద్దని అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాల్లో నిర్మించే ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలను పాటించాలని చెప్పారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునే లబ్ధిదారులకు ఇసుకను ఉచితంగా అందిస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయం తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలి

నాగర్‌కర్నూల్ రూరల్: మండలంలోని పెద్దాపూర్‌లో మొదటి విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణం త్వరగా పూర్తి చేసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గ్రామంలో పలువురు లబ్ధిదారులకు చెందిన నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పనులను అదనపు కలెక్టర్ దేవసహాయం, ఎంపీడీఓ కోటేశ్వర్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులతో కలెక్టర్ మాట్లాడారు. ఇళ్ల నిర్మాణం చేపట్టి ఎన్ని రోజులు అవుతుందని నిర్మాణానికి మెటీరియల్ ఎక్కడి నుంచి తెచ్చుకుంటున్నారని, ఇప్పటి వరకు ఎంత ఖర్చు అయ్యిందని ఆరా తీశారు. పూర్తయిన ఇళ్లకు లబ్ధిదారుల ఖాతాల్లో రూ.లక్ష జమ చేస్తామన్నారు.

ఎన్నాళ్లీ కష్టాలు



జీల్దార్‌తిప్ప చెరువు ఇదే..

కృష్ణా జలాలకు నోచుకోని జీల్దార్‌తిప్ప చెరువు

- కేఎల్ఐ చెంతనే ఉన్నా మొలచింతపల్లి, ముక్కిడిగుండం గ్రామాలకు అందని సాగునీరు
- చెరువు కింద 3 వేల ఎకరాలకు పైగా ఆయకట్టు
- సాగునీటి మళ్లింపు కోసం కెనాల్ తవ్వేందుకు ఆరేళ్ల క్రితం శంకుస్థాపన

కొల్లాపూర్: కేఎల్ఐ ప్రాజెక్టుకు కూతవేటు దూరంలో ఉన్నప్పటికీ ఆ గ్రామాలు సాగునీటికి నోచుకోవడం లేదు. ప్రాజెక్టు ప్రారంభం నుంచి సాగునీటి కోసం ఆయా గ్రామాల ప్రజలు ప్రజాప్రతినిధులను వేడుకుంటూనే ఉన్నా.. కానీ, వారి కోరిక మాత్రం నెరవేరడం లేదు. ఇది కొల్లాపూర్ మండలంలోని ముక్కిడిగుండం, మొలచింతలపల్లి గ్రామాల పరిస్థితి. దీంతో నేటికీ ఆయా గ్రామాల రైతులు వర్షాధారంగా.. మరికొందరు బోరుబావులు తవ్వుకొని పంటలు సాగుచేస్తున్నారు. అయితే రెండు గ్రామాలకు అనుసంధానంగా ఉన్న జీల్దార్‌తిప్ప చెరువుకు కేఎల్ఐ నీటిని మళ్లించాలని డిమాండ్ చేస్తున్నారు. అలా జరిగితే రెండు గ్రామాలకు సాగునీటి సమస్య తీరడంతోపాటు నల్లమల అటవీ ప్రాంతంలోని వన్యప్రాణులకు శాశ్వతంగా తాగునీటి వనరులు అందుబాటులో వస్తాయి.

ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతంలో..

కేఎల్ఐ ప్రాజెక్టుకు కేవలం 3 కి.మీ., దూరంలోనే మొలచింతపల్లి, 6 కిలోమీటర్ల దూరంలో ముక్కిడిగుండం గ్రామాలు ఉంటాయి. వీటికి అనుబంధ గ్రామాలు సైతం ఉన్నాయి. ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతంలో ఈ గ్రామాలు ఉండడంతో కేఎల్ఐ నీటిని ఆయా శివార్లకు తరలించేందుకు అధిక మొత్తంలో ఖర్చవుతుందని అధికారులు పట్టించుకోలేదు. తర్వాతి కాలంలో ప్రజల నుంచి డిమాండ్లు పెరగడంతో పాలకులు రెండు గ్రామాలకు సాగునీటిని మళ్లించేందుకు చర్యలు చేపట్టారు. పనుల కోసం శిలాఫలకాలు వేసినా.. కానీ, పనులు మాత్రం ముందుకు సాగడం లేదు.

ఉన్నతాధికారులకు విన్నవిస్తాం..

కేఎల్ఐ ప్రాజెక్టు ద్వారా జీల్దార్‌తిప్ప చెరువుకు నీటిని మళ్లించే అంశం ఉన్నతాధికారుల పరిశీలనలో ఉంది. ఈ పనులకు రెండుసార్లు నిధుల కేటాయింపు జరిగింది. అయితే భూ సేకరణలో సమస్యల కారణంగా గతంలో పనులు ముందుకు సాగలేదు. నిధుల కొరత కూడా కారణమే. నిధుల కేటాయింపు, భూ సేకరణ సమస్య, అవసరమైన నిధుల వివరాలతో గతంలో సీఈకి నివేదిక పంపించాం. మరోసారి ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తాం.

– శ్రీనివాసరెడ్డి, ఈఈ, నీటిపారుదల శాఖ

చెరువులు, బోరు బావులే..

మొలచింతలపల్లి, ముక్కిడిగుండం రెవెన్యూ శివార్లలోని భూముల సాగుకు చెరువులు, బోరుబావులే దిక్కయ్యాయి. ప్రధానంగా జీల్దార్‌తిప్ప చెరువు కిందనే అధిక ఆయకట్టు ఉంది. ఈ చెరువును 1970లో అప్పటి కొల్లాపూర్ ఎమ్మెల్యే కె.రంగదాసు నల్లమల అటవీ ప్రాంతంలో నిర్మించారు. 2 టీఎంసీల నీరు నిల్వ ఉండేలా నిర్మించిన ఈ చెరువును మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ప్రారంభించారు. చెరువు కింద ప్రస్తుతం దాదాపుగా 1,800 ఎకరాల ఆయకట్టు ఉంది. సాగునీరు సమృద్ధిగా ఉంటే 3 వేల ఎకరాల మేర ఆయకట్టు సాగవుతుంది. వర్షాకాలంలో చెరువు నీళ్ల ద్వారా పంటలు సాగు చేస్తున్న రైతులు రబీ సీజన్‌లో మాత్రం సాగునీరు లేక పొలాలను బీళ్లుగా వదిలేస్తున్నారు.

వన్యప్రాణులకూ ఉపయోగమే..

జీల్దార్‌తిప్ప చెరువును ఆనుకొని నల్లమల అటవీ ప్రాంతం ఉంటుంది. ఈ చెరువును కేఎల్ఐ నీటితో నింపితే చెరువు కింద ఆయకట్టుకు పుష్కలంగా సాగునీరు అందడంతోపాటు నల్లమల అటవీ ప్రాంతంలోని వన్యప్రాణులకు శాశ్వతంగా తాగునీటి సౌకర్యం కల్పించినట్లు అవుతుంది. జీల్దార్‌తిప్ప చెరువుకు రెగ్యులర్‌గా తాగునీటి కోసం వన్యప్రాణులు వస్తుంటాయి.

రూ.3 కోట్ల వ్యయంతో..

కేఎల్ఐ నీటిని జీల్దార్‌తిప్ప చెరువుకు మళ్లించి అక్కడి నుంచి కాల్వల ద్వారా రెండు గ్రామాల్లోని పంట పొలాలకు సాగునీరు అందించాలనే ప్రయత్నం చాలాకాలంగా సాగుతోంది. 2004లో రూ.3 కోట్ల వ్యయంతో కృష్ణా బ్యాక్‌వాటర్‌పై మినీ లిఫ్టు నిర్మించేందుకు శిలాఫలకం వేసినా కానీ పనులు చేపట్టలేదు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత మరోసారి మొలచింతలపల్లి, ముక్కిడిగుండం గ్రామాల పొలాలకు సాగునీరు మళ్లించాలనే అంశం తెరపైకి వచ్చింది. 2019లో కేఎల్ఐ నుంచి జీల్దార్‌తిప్ప చెరువుకు నీటిని తరలించేందుకు రూ.19 కోట్లు కేటాయించారు. అదే సంవత్సరం మార్చిలో పనులు చేపట్టేందుకు శంకుస్థాపన చేశారు. భూ సేకరణకు కేటాయించిన నిధులు తక్కువగా ఉండడంతో పనులు ముందుకు సాగలేదు. నిధుల పెంపు కోసం అధికారులు మరోసారి ప్రతిపాదనలు పంపించి చేతులు దులుపుకొన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జీల్దార్‌తిప్ప చెరువు అంశం చర్చకు వచ్చింది. కానీ, ఎలాంటి పురోగతి కనిపించడం లేదు.

క్లుప్తంగా

చెరువులో పడి మహిళ మృతి

తెలకపల్లి: చెరువులో పడి మహిళ మృతి చెందిన ఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అనంతసాగర్ గ్రామానికి చెందిన కనుకు క్రిష్ణవేణి(35), భర్త క్రిష్ణయ్యకు కుటుంబ సమస్యలపై గొడవ పడి ఇంట్లో నుంచి వెళ్లిందన్నారు. విషయం తెలుసుకున్న భర్త కృష్ణయ్య వెతకగా.. శుక్రవారం గ్రామ శివారులో చెరువుకట్ట తూం వద్ద క్రిష్ణవేణి చెప్పులు కనిపించాయి. దీంతో చెరువులో గాలింపు చేపట్టగా క్రిష్ణవేణి మృతదేహం దొరికినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలి తల్లి కాశమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి


మృతుడు ప్రభాకర్(ఫైల్)

బల్మూర్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందిన ఘటన శుక్రవారం మండలంలోని మైలారం గ్రామ బస్ స్టేజీ సమీపంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రమాదేవి వివరాల ప్రకారం లింగాలకు చెందిన గాలేటి ప్రభాకర్(40) అచ్చంపేట నుంచి ద్విచక్ర వాహనంపై లింగాలకు వెళ్తున్నాడు. మార్గమధ్యలో వాహనం అదుపు తప్పి కింద పడడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. 108 అంబులెన్సులో అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. వాహనంపై ఉన్న మరో వ్యక్తి సత్తయ్య స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మృతుడికి భార్య కల్పన, ముగ్గురు సంతానం ఉన్నారు. మృతుడి సోదరుడు సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

గద్వాల క్రైం: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం రాత్రి జిల్లాకేంద్రం సమీపంలోని అనంపురం శివారులో చోటు చేసుకున్నట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. గద్వాల మండలం మేళ్లచెరువుకు చెందిన కిష్టఫర్ (42) గురువారం సాయంత్రం వ్యక్తిగత పని నిమిత్తం ఎర్రవల్లికి బైక్‌పై వెళ్లి తిరుగు పయనమయ్యాడు. అర్ధరాత్రి సమయంలో అనంతపురం శివారుకు చేరుకోగానే అటుగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టడంతో కిష్టఫర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి వెంటనే చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య బుచ్చమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

బిహార్ యువకుడి బలవన్మరణం

హన్వాడ: మండలంలోని మాధారం గ్రామ శివారు మల్లికార్జున రైస్‌మిల్‌లో పనిచేసే బిహార్ రాష్ట్రానికి చెందిన ఓ యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుని మృతిచెందినట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన పగిలేష్ కుమార్(18) తన అన్న నిరంజన్‌కుమార్‌తో కలిసి మాధారం శివారులోని మల్లికార్జున రైస్‌మిల్‌లో పనిచేస్తున్నాడు. స్వగ్రామంలో ఓ యువతి ప్రేమలో పడిన పగిలేష్‌ను తల్లిదండ్రులు మందలించి ప్రేమించిన యువతిని మరిచిపోయేందుకు గాను అన్న నిరంజన్ పని చేసే రైస్‌మిల్‌కు వారం రోజుల క్రితం పంపించారు. అయితే పగిలేష్‌కుమార్ తాను ప్రేమించిన అమ్మాయికి తనను దూరం చేశారని మనస్తాపం చెంది రైస్‌మిల్ పరిసర ప్రాంతంలో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ విషయమై పగిలేష్ అన్న నిరంజన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాదేపల్లి మార్కెట్‌లో తడిసిన ధాన్యం



జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా కురిసిన వర్షానికి ధాన్యం బస్తాలు తడిసిపోయాయి. వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 20 వేల బస్తాలకు పైగా ధాన్యం, మొక్కజొన్న, ఇతరపంట దిగుబడులు యార్డుకు వచ్చాయి. అయితే షెడ్లు నిండిపోగా మిగతా వాటిని యార్డు ఆవరణలో పోశారు. ఒక్కసారిగా వర్షం రావడంతో కుప్పలపై ప్లాస్టిక్ కవర్లు, తాటిపాళ్లు కప్పారు. అయితే ఎక్కువగా వ్యాపారులు కొనుగోలు చేసిన బస్తాలే తడిసిపోయాయి. కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను తరలించకపోవడంతో యార్డు ఆవరణలోనే మిగిలిపోయాయి. దీంతో అకాల వర్షానికి ఆయా బస్తాలు తడిసిపోయాయి. కాగా రైతులకు ఎలాంటి నష్టం జరగలేదని మార్కెట్ కార్యదర్శి నవీన్‌కుమార్ తెలిపారు. వర్ష సూచనలు గమనించి ముందస్తుగానే తాము రైతులను అప్రమత్తం చేసి ధాన్యం తడవకుండా ప్లాస్టిక్ కవర్లు అందజేశామన్నారు. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా పూర్తి స్థాయిలో షెడ్లు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా రైతులు విజ్ఞప్తి చేశారు.

పిడుగు.. పసిగట్టు


దామిని లైట్నింగ్ యాప్

- పిడుగుపాటును గుర్తించే 'దామిని'
- అకాల వర్షాలు, పిడుగులతో ప్రాణాలు కోల్పోతున్న ప్రజలు
- జాగ్రత్తలు పాటిస్తే బయటపడే అవకాశం

కల్వకుర్తి టౌన్: ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షాలు ప్రజా జీవితాలను అతలాకుతలం చేస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యాలైన ఉరుములతో కూడిన వర్షాలతోపాటు పిడుగుపాటుతో ప్రాణ, ఆస్తినష్టం జరుగుతూనే ఉంది. ఏటా పిడుగుపాటుకు గురై అధిక సంఖ్యలో మూగజీవాలు, చాలామంది ప్రజలు ప్రాణాలు సైతం కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. అయితే పిడుగు పాటుపై పరిశోధనలు చేసిన భారత వాతావరణ శాఖ ముందే పసిగట్టేందుకు ఓ యాప్‌ను ఆవిష్కరించింది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రాఫికల్ మెటరాలజీ (ఐఐటీఎం) 'దామిని' యాప్‌ను రూపొందించింది.

యాప్ డౌన్‌లోడ్ ఇలా..

ప్రతి పౌరుడు తన స్మార్ట్ ఫోన్‌లోని ప్లేస్టోర్ నుంచి దామిని యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. యాప్‌ను తెరిచి పేరు, మొబైల్ నంబర్, అడ్రస్, పిన్‌కోడ్ నమోదు చేయాలి. అనంతరం జీపీఎస్ లోకేషన్ కోసం యాప్ అడిగే అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. యాప్‌ను వినియోగించే సమయంలో మీ ప్రాంతంలో పిడుగుపడే అవకాశం ఉందో లేదో మూడు రంగుల్లో చూపిస్తుంది.

ఎరుపు రంగు : మీరు ఉన్న ప్రాంతంలో మరో 7 నిమిషాల వ్యవధిలో పిడుగుపడే అవకాశం ఉంటే ఆ సర్కిల్ ఎరుపు రంగులోకి వస్తుంది.

పసుపు రంగు : మీరు ఉన్న ప్రాంతంలో 10 నుంచి 15 నిమిషాల్లో పిడుగు పడేలా ఉంటే ఆ సర్కిల్ పసుపు రంగుగా మారుతుంది.

నీలం రంగు : 18 నుంచి 25 నిమిషాలలోపు పిడుగు పడే అవకాశం ఉంటే ఆ సర్కిల్ నీలం రంగులో కనిపిస్తుంది.

జాగ్రత్తలు పాటించాలి..

నల్లటి మబ్బులు ఆకాశం అంతటా విస్తరించి భారీ వర్షం కురుస్తున్నప్పుడు రైతులు పొలాల్లో తిరగకుండా ఏవైనా భవనాల్లోకి లేక తాము ఉన్న స్థానంలోనే మోకాళ్లపై కూర్చొని రెండు చెవులను చేతులతో మూసుకోవాలి.

- బహిరంగ ప్రదేశాల్లో పిడుగుపడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. మొబైల్ సిగ్నల్స్ పిడుగుపడే అవకాశాన్ని ఎక్కువగా కల్పిస్తుంది. పంట పొలాల్లో వాడకూడదు.
- విద్యుత్ స్తంభాలు, సెల్‌ఫోన్ టవర్లు, బోర్ పంప్‌సెట్లకు దూరంగా ఉండాలి. బోరుమోటార్ల నుంచి వచ్చే నీటిని కూడా ఆ సమయంలో వినియోగించవద్దు.
- పశువులను మేతకు బయటకు తీసుకెళ్లకుండా పాకలోనే ఉంచాలి.
- పిడుగులు పొడవైన చెట్ల మీద పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి వర్షం కురిసినప్పుడు చెట్ల కింద ఉండొద్దు.

యాప్ ఉపయోగకరం..

వాతావరణంలోని మార్పులను పసిగట్టి పిడుగుపడే అవకాశాన్ని తెలిపే దామిని యాప్ ప్రజలతోపాటు ముఖ్యంగా రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. యాప్‌ని వినియోగించి పిడుగుపడే విషయాన్ని గుర్తించి ప్రాణాలు కాపాడుకోవచ్చు.

– శ్రీను, ఆర్డీఓ, కల్వకుర్తి

గొర్రెల దొంగలు అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాంబాబు

కొత్తకోట రూరల్: గత నెలలో గొర్రెలను దొంగించిన ఓ ముఠాను అరెస్ట్ చేసి జైలుకు పంపినట్లు సీఐ రాంబాబు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని తన కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. మండలంలోని రాయిణిపేటకు చెందిన గడ్డమీడి బాలరాజు, దేశి మల్లయ్య, దేశి రాములుకు మొత్తం 600 గొర్రెలు ఉన్నాయి. వాటిని చుట్టుపక్కల గ్రామాల్లో మేపుకొని, రాత్రిళ్లు ఎక్కడైనా స్థలం చూసుకొని నిలుపుకొనేవాళ్లు. ఎప్పటిలాగే గత నెల 25న రాత్రి ఆమడబాకుల శివారులోని భారత్ పెట్రోల్ పంపు వెనుక వ్యవసాయ పొలంలో గొర్రెలను నిలిపారు. అర్ధరాత్రి వేళ ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాకు చెందిన ఆరుగురు గొర్రెల మంద దగ్గరకు చేరుకొని 33 గొర్రెలను బొలెరో వాహనంలో ఎక్కించుకొని పారిపోయారు. మందలో గొర్రెలు తక్కువగా కనిపించడంతో దొంగతనం జరిగినట్లు నిర్ధారించుకొని 26న ఉదయం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ ఆనంద్ గొర్రెల దొంగలను పట్టుకునేందుకు ఓ బృందాన్ని ఏర్పాటుచేసి జాతీయ రహదారిపై ఉన్న సీసీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించగా బొలెరో వాహనంలో దొంగలు గొర్రెలను తీసుకెళ్లినట్లు నిర్ధారణకు వచ్చారు. వాహనం అడ్రస్, దొంగలు ఉన్న చోటు వెదికి పట్టుకున్నారు. ఆరుగురిలో బోయ రామనాయుడు, రామాంజనేయులు పట్టుబడగా.. హన్మంతు, ఏడుకొండలు, రంగన్న, చిన్న కురుకుంద పరారీలో ఉన్నట్లు సీఐ వివరించారు. వీరంతా జల్సాలకు అలవాటు పడి గొర్రెల దొంగతనాలకు అలవాటు పడ్డారని.. ఉదయం వేళల్లో రెక్కీ నిర్వహించి రాత్రిళ్లు చోరీలకు పాల్పడుతున్నట్లు గుర్తించామని చెప్పారు. చోరీకి వినియోగించిన బొలెరో వాహనం, రెండు బైక్‌లు, గొర్రెలు అమ్మగా వచ్చిన డబ్బు స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు చెప్పారు.

తూక్యాతండా సమీప గుట్టలో చిరుత సంచారం

నవాబుపేట: మండలంలోని తూక్యాతండా శివారు జమాళ్లగుట్టలో చిరుత సంచరిస్తున్నట్లు స్థానిక గిరిజనులు శుక్రవారం అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఇదే చిరుత గతంలో యన్మన్‌గండ్ల సమీపంలోని దేవరగుట్టలో నివాసం ఉంటూ అటు సమీప గ్రామాల ప్రజలను ఇటు అధికారులను ఆందోళన కలిగింది. దీంతో చిరుతను బంధించేందుకు అటవీ అధికారులు దేవరగుట్టలో బోను, సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయడంతో చిరుత అక్కడి నుంచి మకాం మార్చి దాని సమీపంలోని గుట్టలలో తిరగటం ప్రారంభించింది. రెండు, మూడు రోజులుగా చిరుత సంచారం కనిపించకపోవడంతో దేవరగుట్టలో అటవీ అధికారులు పెట్టిన సీసీ కెమెరాలను సైతం తొలగించారు. తాజాగా చిరుత దేవరగుట్టకు సమీపంలోనీ తూక్యాతండాకు చెందిన జమాళ్లగుట్టలో కనిపించడంతో స్థానికుల్లో మరోసారి భయాందోళనకు గురవుతున్నారు. చిరుత నుంచి రక్షణ కల్పించాలని తూక్యాతండా, యన్మన్‌గండ్ల గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

అటవీ ఉత్పత్తుల కొనుగోలును ప్రోత్సహించాలి


జీసీసీ సిబ్బంది సమావేశంలో సూచనలు చేస్తున్న డీఎం కుంజవాణి

మన్ననూర్: స్థానిక గిరిజన కోఆపరేటివ్ సంస్థ (జీసీసీ) జిల్లా ప్రధాన కార్యాలయంను ఆ సంస్థ డీఎం కుంజవాణి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సంస్థ తరుపున జరుగుతున్న వ్యాపార లావాదేవీల గురించి బ్రాంచ్ మేనేజర్ సంతోష్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. కాలానుగుణంగా వచ్చే అటవీ ఉత్పత్తులు ముఖ్యంగా కుంకుడు కాయలు, విష ముష్టి గింజలు, గుడిపాల వేర్లు, సిల్లగింజలు తదితర అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు ప్రోత్సహించాలని సూచించారు. మహబూబ్‌నగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లోని గిరిజన ఆశ్రమ, సంక్షేమ, గురుకుల పాఠశాలలకు సంస్థ తరుపున సరఫరా చేస్తున్న నిత్యావసర సరుకుల సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సమయానికి అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జీసీసీ అకౌంటెంట్ రూప్లనాయక్, రాములు, రమణ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార కేసులో పదేళ్ల జైలుశిక్ష

భూత్పూర్: అత్యాచారం కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ సెషన్ కోర్టు జడ్జి టి.రాజరాజేశ్వరి శుక్రవారం తీర్పునిచ్చారు. భూత్పూర్ ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాలిలా.. భూత్పూర్ మండలం మద్దిగట్ల గ్రామానికి చెందిన మైనర్ బాలిక (17)ను అదే గ్రామానికి చెందిన బోటిక యాదయ్య ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. 2018 జూలై 4న ఇంట్లో ఎవరూ లేని సమయంలో మాయమాటలు చెప్పి శారీరకంగా లొంగదీసుకున్నాడు. దీంతో బాధితురాలు అదేరోజు భూత్పూర్ పోలీస్‌స్టేషన్‌లో బోటిక యాదయ్యపై ఫిర్యాదు చేసింది. 2018 జూలై 10న అప్పటి సీఐ శ్రీనివాస్‌రావు కేసు నమోదు చేయగా.. సీఐ పాండురంగారెడ్డి విచారణ చేసి చార్జ్‌షీట్ వేశారు. కేసు విచారణ జరిపిన అనంతరం ప్రిన్సిపల్ సెషన్ కోర్టు జడ్జి టి.రాజరాజేశ్వరి యాదయ్యకు పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 10వేల జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్ చెట్టుకు ఢీకొని వ్యక్తి మృతి


ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ రామ్‌లాల్‌నాయక్

చిన్నచింతకుంట: ద్విచక్రవాహనం అదుపు తప్పి చెట్టుకు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన చిన్నచింతకుంట మండలం మద్దూర్ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాంలాల్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నచింతకుంట మండలం అల్లీపురం గ్రామానికి చెందిన బుడుగ జంగం ముత్యాలు (32) శుక్రవారం బైక్‌పై చిన్నచింతకుంటకు వచ్చి పనులు ముగించుకొని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా.. మద్దూర్ సమీపంలో బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు ఢీకొట్టింది. ముత్యాలు తలకు తీవ్ర గాయాలు కావడంతో అటుగా వెళ్తున్న ప్రయాణికులు అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి చికిత్స నిమిత్తం ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపాడు.

నిప్పంటించుకొని యువకుడి ఆత్మహత్య

ధరూరు: పెట్రోల్‌తో నిప్పంటించుకొని ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన గద్వాల జిల్లా ధరూర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రాయచూరుకు చెందిన రంగన్న, చిట్టెమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు. వారిలో చిన్నవాడైన మల్లేష్(26) చిన్నతనం నుంచి అమ్మమ్మ వద్ద ధరూరులోనే ఉంటున్నాడు. మూడేళ్ల క్రితం గోనుపాడుకి చెందిన నందినితో వివాహం జరిగింది. వారికి ఒక బాబు, కుమార్తె ఉన్నారు. గురువారం మల్లేష్ భార్య నందిని పుట్టిల్లు గోనుపాడు గ్రామానికి వెళ్లింది. ఈ క్రమంలోనే ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. అది గమనించిన చుట్టుపక్కల వారు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. మంటలను ఆర్పి వెంటనే గద్వాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. 70 శాతం కాలిన గాయాలతో ఉన్న మల్లేష్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించగా.. అక్కడే చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు. మృతుడి భార్య నందిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీహరి తెలిపారు. మృతికి గల కారణాలు తెలియరాలేదని, ఘటనపై విచారణ చేపట్టినట్లు ఆయన తెలిపారు.

వాలీబాల్ జట్లకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేత



జిల్లా బాలుర జట్టుకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

మహబూబ్‌నగర్ క్రీడలు: గత ఏడాది డిసెంబర్ చివరి వారంలో నిర్వహించిన సీఎం కప్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో జిల్లా బాలుర, బాలికల జట్లు రన్నరప్‌గా నిలిచాయి. ఖమ్మం పట్టణంలో శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో ద్వితీయ స్థానంలో నిలిచిన జిల్లా జట్లకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో కోచ్ పర్వేజ్ పాష పాల్గొన్నారు. జిల్లా జట్లను జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ అభినందించారు.


బాలికల జట్టుకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేసిన ప్రతినిధులు

భక్తిశ్రద్ధలతో ఆరుద్ర పూజలు


అన్నాభిషేకంలో బాలబ్రహ్మేశ్వరస్వామివారు


జోగులాంబ ఆలయంలో కుంకుమార్చన పూజలు చేస్తున్న భక్తులు

అలంపూర్: ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని శుక్రవారం అలంపూర్ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో ఆరుద్రోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని ధ్వజస్తంభం వద్ద అర్చకులు ప్రత్యేక పూజలు, మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచ్ఛారణల నడుమ గోప్రదక్షిణ చేశారు. అలాగే వినాయక పూజలు, బాలబ్రహ్మేశ్వర స్వామిని పంచామృతాలు, మంగళద్రవ్యాలతో అభిషేకించారు. అన్నసూక్త పఠనంతో అన్నమును లింగాకృతిలో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవంలో పాల్గొన్న భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం పలికారు.

జోగుళాంబ ఆలయంలో చండీ హోమాలు..

ప్రతి శుక్రవారం అమ్మవారి ఆలయంలో చండీహోమాలు జరుగుతాయి. ఈ వారం జరిగిన చండీ హోమంలో 38 మంది భక్తులు పాల్గొన్నట్లు ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన పూజలు, స్వామివారి ఆలయంలో అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు ఆలయ అధికారులు స్థానిక అన్నదాన సత్రంలో అన్నప్రసాదం అందజేశారు.

'ఆర్.కృష్ణయ్య పోరాట ఫలమే కులగణన'


మాట్లాడుతున్న కృష్ణయాదవ్

జడ్చర్ల టౌన్: కేంద్ర ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే జనగణనలో భాగంగా బీసీ కులగణన చేపడతామని ప్రకటించడం ఆర్.కృష్ణయ్య పోరాట ఫలమేనని బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ యాదవ్ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని ఎమ్మార్పీ కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 45ఏళ్లుగా కృష్ణయ్య చేస్తున్న పోరాట ఫలితంగానే బీసీ కులగణన చేపట్టడానికి కేంద్రం ముందుకొచ్చిందని కొనియాడారు. అలాగే చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ బిల్లు సైతం పెట్టాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి తెలంగాణ రాష్ట్రమే మార్గదర్శకమని ముఖ్యమంత్రి ప్రకటించడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. దేశంలో సంపూర్ణంగా కులగణన చేపట్టిన ఘనత బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్‌కే దక్కుతుందన్నారు. జనాభా దామాషా పద్ధతిన అన్ని ప్రభుత్వ రంగ సంస్థలలోనూ రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ జాగృతి సేన నియోజకవర్గ అధ్యక్షుడు నిరంజన్, కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి శేఖర్, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు గోపాలు పాల్గొన్నారు.

స్కేటింగ్ చేస్తూ యువకుడి జ్యోతిర్లింగాల దర్శనం


రోషన్‌ను సన్మానిస్తున్న అయ్యప్ప దీక్ష ప్రచార సమితి సభ్యులు

స్టేషన్ మహబూబ్‌నగర్: బిహార్‌కి చెందిన రోషన్ స్కేటింగ్‌పై లోక కల్యాణార్థం దేశంలోని 12 జ్యోతిర్లింగాల దర్శనం కోసం శ్రీకారం చుట్టాడు. 80 రోజుల క్రితం గుజరాత్ రాష్ట్రం నుంచి ప్రారంభమైన ఈ యాత్రలో రోషన్ ఇప్పటి వరకు ఏడు జ్యోతిర్లింగాలను దర్శించుకొని శుక్రవారం జిల్లాకేంద్రానికి చేరుకున్నాడు. ఈ సందర్భంగా రోషన్‌ను అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి అధ్యక్షుడు సీమ నరేందర్, సభ్యులు ఘనంగా సన్మానం చేశారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించి ఖర్చుల కోసం కొంత ఆర్థిక సహాయం అందజేశారు. ఇక్కడి నుంచి రోషన్ శ్రీశైలం క్షేత్రం దర్శనం కోసం బయలుదేరాడు. కార్యక్రమంలో సభ్యులు శంకరన్న, రఘురాంగౌడ్, రామేశ్వర్, సతీష్‌కుమార్, సంతోష్, అర్జున్, రమేష్, మల్లేష్, ప్రమోద్, శరణప్ప, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

భారీగా పశుగ్రాసం దగ్ధం

త్రుటిలో తప్పించుకున్న నాలుగు జతల ఎద్దులు.. రూ.27 లక్షల నష్టం


పశుగ్రాసం కాలి ఎగిసిపడుతున్న మంటలు

ఉండవెల్లి: పాడి పశువుల కోసం నిల్వ చేసిన పశుగ్రాసం గురువారం అర్ధరాత్రి దగ్ధమైన ఘటన మండలంలోని ప్రాగటూరులో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన హుస్సేన్, జయన్న, గొల్ల మద్దిలేటి, తెలుగు మధు, ఆగనూరు లక్ష్మన్న, బోయ లక్ష్మన్న, బోయ లవన్న, షరీఫ్, నిరంజన్, కుశలన్న గ్రామ శివారులో కంది, శనగ, వేరుశనగ పొట్టు మొత్తం 18 వాముల పశుగ్రాసాన్ని పశువుల మేత కోసం కొనుగోలు చేసి నిల్వ చేసుకున్నారు. గురువారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు నిప్పంటుకొని మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల ఇళ్ల వారు గుర్తించి వెంటనే గ్రామస్తులు, అలంపూర్ చౌరస్తాలోని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అలంపూర్‌తో పాటు గద్వాలకు చెందిన ఫైరింజన్లతో అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో పశుగ్రాసంలో నిల్వ చేసిన 800 ప్లాస్టిక్ పైపులు, రెండు కొట్టాలు, రెండు బోరుమోటార్లు, మూడు ఎద్దుల బండ్లు, ఇతర వ్యవసాయ సామగ్రి కాలిబూడిదయ్యాయి. అక్కడే కట్టేసిన నాలుగు జతల ఎద్దులు మంటలకు తాళ్లు కాలిపోవడంతో తప్పించుకున్నాయి. అలంపూర్ మార్కెట్‌యార్డు చైర్మన్ దొడ్డెప్ప ఘటన స్థలాన్ని పరిశీలించి అడిషనల్ కలెక్టర్‌కు ఫోన్‌లో సమాచారమిచ్చారు. తహసీల్దార్ ప్రభాకర్, ఎంపీడీఓ తిరుపతన్న పరిశీలించగా ఆర్‌ఐ శ్రీవాణి పంచనామా రాశారు. మొత్తం రూ.27 లక్షలకుపైగా నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్‌కు వివరించి పాడి రైతులకు పరిహారం అందించేందుకు కృషి చేస్తామని చైర్మన్ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో దుకాణం దగ్ధం



కేటీదొడ్డి: షార్ట్ సర్క్యూట్‌తో చెప్పుల దుకాణం దగ్ధమైన ఘటన మండల కేంద్రంలోని శుక్రవారం చోటు చేసుకుంది. బాధితులు అబేదాబేగం వివరాల ప్రకారం... మండల కేంద్రంలోని కేబీఎస్ ఫుట్‌వేర్ దుకాణాన్ని మూసి ఇంటికి వెళ్లగా.. మధ్యాహ్న సమయంలో దుకాణంలో మంటలు రావడంతో గమనించిన స్థానికులు ఫైరింజన్, పోలీసులకు సమాచారమిచ్చినట్లు తెలిపారు. ఎస్‌ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో దుకాణం తెరిచి చూడగా అప్పటికే షార్ట్ సర్క్యూట్‌తో చెలరేగిన మంటల ధాటికి దుకాణం కాలి బూడిదైనట్లు పేర్కొన్నారు. ప్రమాదంలో దాదాపు రూ.5 లక్షల ఆస్తినష్టం జరిగినట్లు బాధితురాలు పేర్కొన్నారు. ప్రభుత్వం తరపున ఆదుకోవాలని కోరారు.